

# నా కళ్ళతో నాన్న

- లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**సాధారణంగా** అందరి తండ్రులు ఆఫీసుకి వెళ్తారు, పిల్లల మార్కులు చూసి తిడతారు. మాది అసాధారణ కుటుంబం.

"మా నాన్నకి హాఫ్‌డే నేను త్వరగా ఇంటికి వెళ్ళాలి",

"రేపు మా నాన్నకి హాలీడే మేము సినిమాకి వెళ్తున్నాం",

"మా నాన్నకి ఆఫీసులో లేట్ అయితే బావుండు. ఇవాళ్ళ రిపోర్ట్ కార్డ్ ఇచ్చారు" వంటి వాక్యాలు నన్ను ఆశ్చర్యపరిచేవి. ఎందుకంటే మా ఇంట్లో ప్రతీరోజూ సండేనే. ఉదయాన్నే పరుగెత్తే అవసరం లేకపోవడంతో మా నాన్న ఆలస్యంగా లేచేవారు. తను నిద్రపోతున్న గదిలోకి ఎవరూ వెళ్ళేవారు కాదు. కానీ దాగుడుమూతలాడుతున్నప్పుడో, లేదా హోలీ రోజునో ఆయన గదిలోకి దూరేదాన్ని. కొన్నిసార్లు మంచం కింద దాక్కుంటే మరి కొన్నిసార్లు మా నాన్న పక్కన నిద్రపోయేదాన్ని. కానీ ఏరోజూ తన నిద్రని భంగపరచలేదు. ఇంట్లోనుండే పని చెయ్యడంతో మా మొదటి మాటలు, తొలి అడుగులు, అలకలు మా అమ్మతోపాటు మా నాన్నకూడా చూడగలిగారు. అలాంటి అదృష్టం చాలా తక్కువమందికి ఉంటుంది. అలాగే, అమ్మతోపాటు నాన్నకూడా ఎప్పుడూ దగ్గరగా ఉండడం కొంతమంది పిల్లలు మాత్రమే పొందే వరం. ప్రతీరోజూ ఉదయం లేవడం మొదలు వంట వార్పూ, పుస్తకాలు పంపడం, బ్యాంక్, పోస్టాఫీసు పనులు, ఇన్‌స్టాల్ మెంట్స్ రాయడం వంటి పనులతో సెలవులేకుండా సాయంత్రం వరకు బిజీగా ఉండే మా అమ్మ కొన్నిసార్లు సహాయం కోసం మమ్మల్ని లేపేది. కొన్నిసార్లు మేము లేస్తే పని జరగదని "ఇంకొంచెం సేపు పడుకో" అనేది.

చదువు విషయంలో చాలామంది తల్లిదండ్రులు పిల్లలను వత్తిడి చేస్తారు. అలాంటి కుటుంబాలకు చెందిన నా స్నేహితులు నన్ను చూసి ఈర్ష్యపడేవారు. "అమ్మా, నా ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో సైన్ చెయ్యవా?" అంటే "వంటలో ఉన్నాను పండు, నాన్నని అడుగు" అని, "నాన్నా సైన్ చెయ్యవా?" అంటే "అమ్మకి చూపించమ్మా" అని అనేవారు. టైం ఉన్నప్పుడు సైన్ చేస్తారులే అని వాళ్ళ టేబుల్ మీద నా రిపోర్ట్‌కార్డ్‌ని పెట్టిన ప్రతీసారి అది మాయమవ్వడంతో తిరిగి ప్రయత్నించలేదు. టీచర్‌తో "మై మామ్ మిస్‌ప్లేస్డ్ ఇట్" అని చెప్పగానే

ఆవిడ పెద్దగా నవ్వడం నాకు ఇంకా గుర్తు. ఇలాకాదని నేనే ఫోర్జరీ చెయ్యడం మొదలు పెట్టాను. "అమ్మా, నీ సైన్ పెడుతున్నాను. స్కూల్ నుంచి ఫోన్ వస్తే నువ్వే చేసానని చెప్పు" అనేదాన్ని. మా నాన్న సంతకం పక్కనే నేను ఫోర్జరీ చేస్తే కొన్ని సార్లు "అదేంటి? నేను ఒకటే సంతకం చేసాను కదా. రెండోదెలా వచ్చింది?" అని అర్థం కానట్టు నటించేవారు. కొన్నిసార్లు రెండిట్లో అసలు సంతకం కనిపెట్టలేకపోయేవారు. అలా మూడవ తరగతిలో నేర్చుకున్న సంతకాలు ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్‌లో అటెండెన్స్ షార్టేజ్ లెటర్ వరకు ఉపయోగపడ్డాయి. 'గుర్రాన్ని చెరువు వరకు తీసుకెళ్ళచ్చు కానీ నీరు తాగించలేము" అన్న విధంగా "చదవాలనుకుంటే చెప్పకపోయినా అదే చదువుతుంది" అని మా అమ్మా, నాన్నా అనేవారు.

చదువు విషయంలో నాది మా నాన్న పోలిక. అవసరమైనంత వరకే చదువుతాం. కావ్యది మా అమ్మపోలిక. అవసరాన్ని మించి చదువుతారు. కాలేజీ అప్లికేషన్ ఫార్మ్ నింపేప్పుడు నా ఫ్రెండ్స్‌కన్నా నా ఫార్మ్ భిన్నంగా ఉండడానికి ఒక కారణం పేరెంట్స్ ఎడ్యుకేషన్. ఫాదర్ - గ్రాడ్యుయేట్. మదర్ పోస్ట్‌గ్రాడ్యుయేట్. కెరియర్ పరంగా బిజీగా ఉండే మా నాన్న మా చదువు విషయాన్ని స్టేట్ ఫస్ట్ వచ్చిన మా అమ్మకి అప్పగించారు. నేను రెండు, మూడు తరగతుల్లో ఉన్నప్పుడు మా అమ్మ మాస్టర్స్ చదివింది. తన సోక్రటీస్, టాల్‌స్టాయ్, ప్లేటో పాఠాలు నాకు బెడ్‌టైం స్టోరీస్. ఈ రోజుకీ ఫిలాసఫీ, ఏన్ష్యంట్ హిస్టరీ అంటే నాకు చాలా ఆసక్తి. ముగ్గురు పిల్లల్ని పెంచుతూ, ఇల్లూవాకిలి చక్కదిద్దుతూ, మా నాన్న రాసేవి ఫెయిర్ కాపీ చేస్తూ, పరీక్షల్లో క్లాస్ ఫస్ట్ రావడం మా అమ్మకే సాధ్యం.

మా అమ్మ కాలేజీకి వెళ్ళి, కావ్య, ఊహ స్కూల్లో ఉన్న సమయం మా నాన్నే నన్ను ఆడించేవారు. యధావిధిగా తను రాసుకుంటుండగా నేను బాగా అల్లరి చేసేదాన్ని. ఆయనకి విసుగూ, కోపం వచ్చినా తన ముఖంలో, కంఠంలో ఎన్నడూ తెలియనివ్వలేదు. నాకు బాగా గుర్తున్న సంఘటన: ఓ మధ్యాహ్నం మా నాన్న గదిలోకి వెళ్ళి "నాన్నా, నాకు తోచట్లేదు" అని చెప్పాను. ఓ పుస్తకాన్ని ఇచ్చి చదువుకోమన్నారు. ఆ పుస్తకంలో బొమ్మలు లేవు. అక్షరాలు చిన్నగా, దగ్గరగా ఉన్నాయి. ఒక్కో పేజీలో దాదాపు ముప్పై వాక్యాలు ఉన్నాయి. వెంటనే మా నాన్న దగ్గరికి వెళ్ళి "తోచట్లేదు" అన్నాను. తను ఇచ్చిన పుస్తకం నాలుగైదేళ్ళ నాకు క్లిష్టంగా ఉందని తెలుసుకుని వెంటనే పెన్ పక్కన పెట్టి నన్ను వాల్డెన్‌కి తీసుకెళ్ళారు. ఏసాప్స్ ఫేబుల్స్, ఫెయిరీ టేల్స్, కలరింగ్ బుక్స్, స్కెచ్ పెన్స్, వర్డ్ సెర్చ్ లాంటివి కొనుక్కున్నాను. ఇంటికి రాగానే ముందుగా ఆ పుస్తకాల్లోని బొమ్మలు చూసాను. ఐదు నిమిషాల్లో మా నాన్న గదిలోకి వెళ్ళి "నాన్నా, 'బి ఈ సీ ఏ యూ ఎస్ ఈ' అంటే ఏంటి?" అని అడిగాను.

ఆ రోజు సాయంత్రం మా అమ్మతో మాట్లాడుతూ "లిపిని స్కూల్ మార్పించాలి. ఈ స్కూల్లో సరిగ్గా చెప్పట్లేదు. చిన్న పదాలు కూడా చదవలేకపోతుంది" అని మా నాన్న ఆందోళనగా అన్నారు. "యూకేజీ పిల్లలకి ఎక్కడైనా ఏ ఫర్ ఏపిల్ బి ఫర్ బాల్ నేర్పిస్తారు" అని మా అమ్మ సమాధానమిచ్చింది. అలాగే, సాయంత్రాలు నేనూ, ఊహ గొడవపడకుండా ఉండడానికి మా నాన్న చదివేసిన పేజెంట్ వంటి మాగ్‌జైన్స్ ఇచ్చి అమ్మాయి ఫోటోలకి గడ్డాలు, మీసాలు, అబ్బాయి ఫోటోలకి పొడుగు జుట్టు గీయమనేవారు. పుస్తకంలో ఎడమవైపు పేజీలు ఊహవైతే కుడిపక్క పేజీలు నావి. లాఫయెట్‌లో ఉన్నప్పుడు ఊహ ఇంట్లోని వోగ్ మేగ్‌జైన్స్‌లో ఫోటోలకి గడ్డాలు, మీసాలు ఉండడం గమనించాను.

చీకటయ్యే సమయానికి టార్చ్‌లైట్‌ని గోడమీద వేస్తే "బాల్..." అని మేం ముగ్గురం దాన్ని పట్టుకునే ప్రయత్నం చేసేవాళ్ళం. ఇల్లంతా పరుగెడుతూ, గట్టిగా నవ్వుతూ, కేరింతలతో మా సాయంత్రాలు గడిచేవి. ప్రతీరోజూ ఇందిరాపార్క్‌లో మా నాన్న వాక్ చేస్తూ మావైపో కన్నేసి ఆడుకోమనేవారు. జారుబండకి నేను అనేక సార్లు భయపడిన సంఘటనలు ఉన్నాయి. కావ్య, ఊహ మాటలు నన్ను కదిలించని సమయంలో మా నాన్న ఇచ్చిన ధైర్యం రోజంతా సరిపోయేది. ఈ రోజుకీ "ఐయాం వరీడ్. ఐయాం స్కేర్డ్" వంటి మెసేజెస్ పంపితే కావ్య, ఊహ తోడు చాలని రోజు మా నాన్నే నాకు కొండంత బలం. (నేను కాలాన్ని వెనక్కి తిప్పే యంత్రాన్ని కనిపెడతాను అంటే, 'నువ్వు చెయ్యగలవు పండు' అనే మనస్తత్వం మా అమ్మది.) ఇందిరా పార్క్‌కి వెళ్ళని రోజులు ప్రైం టైంలో బాల్స్‌తో

ఆడుకోవడంలో గడిచిపోయేది. 'నాన్నా ఆడుకుందాం' అన్న వెంటనే పనులు పక్కన పెట్టి రావడం నాకు ఇంకా గుర్తుంది. కావ్య, ఊహ కన్నా నాకు మా నాన్నతో ఎక్కువ స్నేహం ఏర్పడడానికి ఆ జ్ఞాపకాలే ముఖ్యకారణం కాబోలు. "లిపి, నాన్నకి నువ్వు చెప్పు", "నువ్వు చెప్తే నాన్న ఒప్పుకుంటారు" అని కావ్య, ఊహ అనేవాళ్ళు. మేం ముగ్గురు మా నాన్నకి సమానం అని తెలిసినా ఆ బతిమాలింపు, చాక్లెట్ల కోసం సరే అనేదాన్ని.

కరెంట్ పోయినప్పుడు మా నాన్న గోడమీద నీడలు వేసి నన్ను నవ్వించేవారు. పెద్దయ్యాక కావ్య ఆ నీడలతో బోలెడు కథలు చెప్పింది. మా నాన్న మొదటిసారి గోడమీద మేక నీడ వేసిన రోజు నాకు ఈరోజుకీ గుర్తుంది. నేను బెడ్‌రూంలో ఉండగా కరెంట్ పోయింది. నేను నిద్రపోయాననుకుని ఆ గదిలోకి ఎవరూ కాండిల్‌ని తీసుకురాలేదు. భయంతో గట్టిగా ఏడ్చి కేకలు పెట్టాను. మా అమ్మ నవ్వించే ప్రయత్నం చేసినా నా ఏడుపు ఆగలేదు. ఆరుబయట మా నాన్నతో కూర్చున్న జంధ్యాలగారు కూడా నన్ను నవ్వించలేకపోయారు. "నీడని చూసి భయపడకు. అది నీ నీడ. నువు ఎలా కదిలితే అది అలా కదులుతుంది" అని మా నాన్న అనగానే చేతులు, కాళ్ళు కదిలించి చూసాను. సంగతి అర్థమైనా భయం తగ్గలేదు. ఏడుపు ఆపినా చిరునవ్వు లేదని గమనించిన మా నాన్న వేళ్ళతో మేకనీడను చేసి నన్ను నవ్వించారు. ఆ రోజు నుండి అది ఆనవాయితీగా మారింది. అప్పటినుండి నీడనేకాదు, చీకటికి కూడా నేను భయపడలేదు.

ఎండాకాలంలో సాయంత్రాలు ఆరుబయట కూర్చుని పాటలు పాడుకోవడం, రాత్రిళ్ళు నిద్రపట్టనప్పుడు అంత్యాక్షరి ఆడడం, నాకున్న కొన్ని జ్ఞాపకాలు. రాత్రిళ్ళు మా అమ్మా, నాన్నా కిషోర్ కుమార్, ముఖేష్ పాటలు వినేవారు. మా నాయనమ్మ ఎం.ఎస్.సుబ్బలక్ష్మి భక్తిగీతాలు వినేవారు. వాటి ప్రభావం నాపై ఈ రోజుకీ ఉంది. ఎవరి ప్రమేయం లేకుండా నాకు అలవాటైంది క్లాసికల్ సితారే.

"ఎప్పుడూ ఆ పాత పాటలు ఎందుకు వింటావు? నువు అప్‌డేట్ అవ్వాలి లిపి",

"లిపి పాటలు చాలా బోరింగ్",

"ఇండియన్ రెస్టారెంట్‌లో ఉన్న ఫీలింగ్ వస్తుంది లిపి" అని ప్రతిసారీ అన్నా అదే నాకు నచ్చే సంగీతం.

నేను 'పాటలు పెడుతున్నా' అనగానే బెదిరిపోయి "వామ్మో, వద్దు నేనే పెడతా. నువ్వు ఉత్త విను" అని కావ్య, ఊహ, నా స్నేహితులు అంటే, "నీక్కూడా ఇది ఇష్టమా?", "ఈ పాట చిన్నప్పుడు బాగా వినేవాడిని" "అబ్బో పాత పాటలు బాగానే తెలుసే?" అని మా అమ్మా నాన్నా అంటారు. కలిసిన ప్రతీసారి సాయంత్రాలు టీ తాగుతూ లేదా ఐస్క్రీం తింటూ పాత పాటలు పాడుకోవడం నాకు బాగా అలవాటైంది.

ఇండియానాకి మేము వెళ్ళేప్పుడు కార్లో తత్వాలు, బాలమురళీకృష్ణ, ఘంటశాల పాటలు వినేవాళ్ళం. ఎన్ని వందలసార్లు విన్నా ఆ డ్రైవ్‌కి సంబంధించిన అనుభూతి చెదిరిపోలేదు. ఎంత మందితో అవే పాటలు విన్నా మా నాన్న స్థానాన్ని ఎవరూ చేరలేదు (అది అసాధ్యం) అంతకన్నా విలువైన అనుభూతిని పొందింది లాస్ట్ ఇయర్ డిసెంబర్‌లో. క్రిస్మస్‌కి రెండు రోజుల ముందు అంతా ఊహ ఇంటికి చేరాం. రాత్రిపూట అందరూ పడుకున్నాక నేను, మా అమ్మా మాట్లాడుకుంటూ చాలాసేపు అలానే కూర్చున్నాం. మేము పాతపాటలు వింటుండగా మా నాన్న కూడా నిద్రపట్టలేదని కిందకి వచ్చారు. ఒక పాట అమ్మ ఛాయిస్, ఒక పాట నాన్న ఛాయిస్, ఒక పాట నా చాయిస్. కేవలం కేండిల్స్, క్రిస్మస్ ట్రీ లైట్‌లలో వెచ్చగా కూర్చుని కమ్మటి పాటలు వింటూ తెల్లవారు ఝామున నాలుగింటివరకూ కబుర్లు చెప్పుకునే రోజు మళ్ళీ రాదేమో అని నేను ప్రతీ క్షణాన్నీ ఆస్వాదించాను.

మెమరీస్ యొక్క విలువ తెలిసిన మా నాన్నకి ఫొటోగ్రఫీ ఇంట్రెస్ట్ తోడవ్వడంతో చిన్నప్పుడు మాకు బోలెడు ఫోటోలు తీసేవారు. కొత్తబట్టలు వేసుకుని, నున్నగా తలదువ్వి, పోజులిస్తూ ఎన్ని ఫొటోలున్నాయో. అలిసిపోయి, చింపిరి జుట్టుతో ఆడుకుంటూ అన్నే ఫోటోలున్నాయి. నాకు బాగా గుర్తున్న ఫోటో వెనుక కథ: నేను ఒకరోజు ఏడుస్తుండగా మా నాన్న కెమెరా తీసుకు రాగానే నవ్వి,

ఫోటో తీసాక తిరిగి ఏడవసాగాను. అలా నేను మెట్లు దిగడానికి భయపడినప్పుడు, స్కేటింగ్ చేస్తూ కిందపడినప్పుడు, స్నానం చేయనని మారాం చేసినప్పుడు, మొదటిసారి గుండు చేసినప్పుడు మొదలగు ఫొటోలు ఈ రోజుకీ నెగిటివ్‌లతో సహా భద్రంగా దాచారు. అవి చూసిన ప్రతిసారీ నేను తిరిగి 1994 - 98 వ సంవత్సరాల నాటి రోజుల్లోకి వెళ్ళిపోతుంటాను.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story